

శిరాడిఘాట్‌లో మళ్లీ విరిగిపడ్డ మట్టిచరియలు

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): హాసన్ జిల్లా సకలేశపుర తాలూకాలోని శిరాడిఘాట్‌లో మళ్లీ మట్టిచరియలు విరిగిపడ్డంతో వాహన సంచారాన్ని తాత్కాలికంగా ఆపేశారు. దొడ్డతప్ల సమీపాన పదే పదే మట్టిచరియలు పడిపోతుండడంతో సుమారు 10 కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జామ్ నెలకొంది. ఆదివారం నుంచి ఈ మార్గంలో ట్రక్, లారీ ట్యాంకర్ల సంచారాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ మార్గంలో ఆంక్షల దృష్ట్యా పోలీసులు హాసన్‌లోని కందలి గ్రామం వద్దనే ఆపేస్తున్నారు. సకలేశపుర వెళ్లే ఆర్టీసీ బస్సులను మాత్రమే అనుమతిస్తున్నారు. మంగళూరు బస్సులు, వాహనాలను కంబలి వద్దనే మళ్లిస్తున్నారు.

మళ్లీ హోర్డింగుల జోరు..!

● ఐదేళ్ల తర్వాత మరోసారి ప్రకటనల హోరు ● మార్గదర్శకాలు రూపొందించిన బీబీఎంపీ ● ఆదాయం కోసం అనుమతించిన ప్రభుత్వం





బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): దేశానికే తలమానికంగా నిలిచిన ఐటీ నగరి బెంగళూరులో కొన్నేళ్లక్రితం ఏ రోడ్డు చూసినా భారీ హోర్డింగ్‌లు కళకళలాడేవి. ప్రతి ఫ్లై ఓవర్‌పైనా ఆకట్టుకునేలా ప్రకటనలు కనిపించేవి. పలు కారణాలతో వాటిని రద్దు చేశారు. ఐదేళ్ల తర్వాత మరోసారి ప్రకటనల హోర్డింగ్‌లు కల్పించేలా కాంగ్రెస్ ప్రభుత్వం, బీబీఎంపీ ప్రకటనల నిబంధనలు 2024 మార్గదర్శకాలను రూపొందించి శనివారం గెజిట్ విడుదల చేసింది. ప్రకటనల మాఫియాకు రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల తర్వాత మరోసారి తెరపైకి తీసుకొచ్చింది. నగర వ్యాప్తంగా ప్రైవేట్ ప్రకటనల ఏజెన్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటుకు వీలు కల్పించింది. 2018లో బీబీఎంపీ అంగీకరించిన అవుట్‌డోర్ ప్రకటనలు, బహిరంగ సందేశాల బైలా నిబంధనలకు పూర్తిగా వ్యతిరేకమైంది. బీబీఎంపీ చట్టం 2020 కొన్ని సెక్షన్‌లలోని అంశాలను అస్త్రాలుగా చేసుకుని బీబీఎంపీ ప్రకటనల నిబంధనలు 2024 మార్గదర్శకాలు సిఫారసు చేసింది. అభ్యంతరాలకు నెలరోజుల గడువు ఇచ్చారు. ఈ విధానం నగర సంక్షేమం కంటే ఏజెన్సీలు, వ్యాపారుల శ్రేయస్సు కోసమే అనేలా ఉందనే విమర్శలు ఉన్నాయి. హైకోర్టు సూచన మేరకు హోర్డింగ్ నిషేధాన్ని తొలగించే ధైర్యం 2018 తర్వాత ఏ ప్రభుత్వం చేపట్టలేదు. అప్పటి నుంచి హోర్డింగ్‌ల ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని ఏజెన్సీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విధానం అమలైతే ప్రకటనల జోరు కొనసాగనుంది. కొత్త బైలా ప్రకారం నేలపైఅమర్చే హోర్డింగ్‌లే కాకుండా భవనాలపైనే హోర్డింగ్‌లు, ఒకటి వెనుక మరొకటి అమర్చే శాండ్‌విచ్, కియోస్క్, నియాన్‌సైన్ హోర్డింగ్‌లకు అవకాశం కల్పించారు. వాటి కొలతలను బట్టి నిబంధనలు విధించారు. రోడ్ల వెడల్పునుబట్టి ప్రకటనను జారీ చేయాలనే నిబంధనలు ఉన్నాయి.

కొన్ని ప్రధాన రోడ్లపై హోర్డింగ్‌లకు నిషేధం ఉంది. ఏదైనా సంస్థ సొంతంగా ప్రకటనలు చేసుకునేందుకు 150 చదరపు అడుగుల పరిమితి విధించారు. 174 చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రకటనలు ప్రదర్శిస్తే సంపూర్ణంగా రుసుం చెల్లించాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు అమలులోకి వస్తే అనధికారికంగా ఏర్పాటు చేసే ప్రకటనలకు అత్యధికంగా జరిమానా విధిస్తారు. వారు చెల్లించేందుకు విఫలమైతే బీబీఎంపీ చరాస్తులు స్వాధీనం చేసుకోవడంతోపాటు బ్యాంకు ఖాతాలను జప్తు చేయడం, క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశం ఉంటుంది. ఇక ఏజెన్సీలు బకాయి పడితే తదుపరి టెండర్లలో వారికి అవవకాశాలు ఉండవు. 2018 ఆగస్టు 1న నగర వ్యాప్తంగా అనధికార హోర్డింగ్‌లు తొలగించాలని హైకోర్టు ఆదేశించింది. 2018 ఆగస్టు 6న ఏడాదిపాటు అవుట్‌డోర్ ప్రకటనలు నిషేధిస్తూ పాలికె కౌన్సిల్ సభ తీర్మానించింది. అదే ఏడాది ఆగస్టు 28న అవుట్‌డోర్ సైనేజ్, సందేశాలు, బైలా 2018కి



పాలికె కౌన్సిల్ ఆదించింది. 2018 సెప్టెంబరు 11న బైలా గెజిట్‌ను ప్రకటించి బహిరంగంగా సలహాలకు రెండు నెలలు గడువు ఇచ్చింది. 2019 ఫిబ్రవరి 6న ప్రకటనల నిషేధంపై పాలికె నిర్ణయానికి హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం స్టే విధించింది. ఆ మరుసటి రోజే ఏకసభ్య ధర్మాసనం నిర్ణయానికి హైకోర్టు బెంచ్ బ్రేక్ వేసింది. 2019 జూలై 15న బీబీఎంపీ ప్రకటనల నియమాలు 2019 మార్గదర్శకాలు సూచించి నగరాభివృద్ధిశాఖకు పంపారు. 2021 జూలై 26న బీబీఎంపీ ప్రకటనల నిబంధన 2019 అంతిమ గెజిట్‌నే ప్రకటించింది. ప్రకటనలకు అవకాశం లేని ప్రాంతాల్లో కుమారకృప రోడ్డులోని విన్సర్‌మానర్ జంక్షన్, శివానంద సర్కిల్ దాకా, రాజ్‌భవన్ రోడ్డులో హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్ నుంచి మిన్స్క్ స్క్వేర్‌దాకా, అంబేడ్కర్ రోడ్డులో కేఆర్ సర్కిల్‌నుంచి ఇన్‌ఫ్యాంట్రీ రోడ్డు దాకా, కేఆర్ సర్కిల్ నుంచి కేజీ రోడ్డు, మహారాణి కళాశాల రోడ్డు, కబ్బన్‌పార్క్, లాల్‌బాగ్ ప్రాంతాల్లో ప్రకటనల హోర్డింగ్‌లు ఉండవు. దేవాలయాలు, మసీదులు, చర్చిలు ఇతర ధార్మిక స్థలాల్లో 100 మీటర్ల దాకా హోర్డింగ్‌లు ఏర్పాటు చేయరాదు. ఫ్లై ఓవర్‌లు రైల్వే బ్రిడ్జిలు, ఎలివేటెడ్ కారిడార్, మొబైల్ టవర్‌లకు నిషేధం వర్తించనుంది. చారిత్రాత్మక కట్టడాలు, జాతీయ ఉద్యానవనాలు, జలాశయాలు, ట్రాఫిక్ సిగ్నల్స్, చెట్లపైనా నిషేధం ఉంటుంది. కొత్త ప్రకటనల విధానం తీసుకురావడం ద్వారా కోట్లాదిరూపాయలు ఆదాయం గడించాలని ప్రభుత్వం భావిస్తోంది.



శిరూరు ప్రాంతంలో వర్షంలో సీఎం సిద్దరామయ్య సందర్శన

మట్టి తవ్వకాలతోనే దారుణం

● శిరూరు ప్రమాదం బాధాకరం ● మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ● ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా శిరూరులో భూమి కుంచించుకుపోయి జరిగిన ప్రమాదం బాధాకరమని, మట్టి తవ్వకాలతోనే ఈ దారుణం జరిగిందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. ఆదివారం శిరూరు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాద వివరాలను ఆరా తీశారు. మృతుల కుటుంబీకులను పరామర్శించారు. కార్యాచరణ చేస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, మిలిటరీ సిబ్బందితో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ గోవా - అంకోలా మధ్య జాతీయ రహదారి 66పై మట్టి చరియలు విరిగిపడ్డంతో 10 మంది చిక్కుకున్నారన్నారు. వీరిలో ఏడుగురి మృతదేహాలు లభించాయని, మరో ముగ్గురికోసం గాలింపులు జరుగుతున్నాయన్నారు. ఘటనలో ఖాళీ గ్యాస్ ట్యాంకర్, భర్తీ ట్యాంకర్ కూడా ప్రమాదంబారిన పడ్డాయన్నారు. టీ స్టాల్ నిర్వహిస్తున్న ఓ కుటుంబంలో ఐదుగురు మృతి చెందారన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం ఇస్తామన్నారు. నౌకాదళం, మిలిటరీ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని వివరించారు. సంఘటన జరిగిన రోజే జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మంకాళవైద్య, ఎమ్మెల్యేలను పంపామని చెప్పారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ నుంచి 46 మంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ నుంచి 24 మంది, 44 మంది మిలిటరీ, నౌకాదళం సిబ్బంది కలసి సహాయక చర్యలు కొనసాగిస్తున్నారని అన్నారు. భూమి కుశించుకుపోవడానికి ఐఆర్‌డీ సంస్థ మట్టి తవ్వకాలు చేపట్టడమే కారణమవుతున్నాయని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రమాద సంఘటనపై జాప్యం చేయలేదన్నారు. 34 ప్రాంతాల్లో భూమి కుశించిందనే మీడియా ప్రశ్నకు సమాధానంగా తమ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అయ్యిందని, గత ఏడాది వర్షాలు లేవని ఇటీవల కొన్ని రోజులుగా వానలు కురుస్తున్నాయన్నారు. కారవార జిల్లా పంచాయతీ కార్యాలయంలో ప్రగతి పరిశీలనా సభ జరిపారు. మంత్రులు కృష్ణబైరేగౌడ, సతీశ్‌జార్కిహొళి, పాలనా సంస్కరణల కమిషన్ చైర్మన్ దేశ్‌పాండే, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మంకాళవైద్య, అదనపు ముఖ్యకార్యదర్శి శాలిని రజనీశ్‌తోపాటు ముఖ్య అధికారులు పాల్గొన్నారు. తీరప్రాంతంలో విద్యుత్ వైర్లు వేగవంతంగా పునరుద్ధరించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే రెవెన్యూమంత్రి కృష్ణబైరేగౌడ సందర్శించారు. కాగా, ఉడుపి వర్షపీడిత ప్రాంతాలను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ సందర్శించారు. వివిధ ప్రాంతాలలో ఆమె పర్యటించారు. బైందూరును సందర్శించి సోమేశ్వర గుట్ట కూలిన ప్రాంతాన్ని దూరంనుంచే పరిశీలించి వెళ్లడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయ సదర్శనకు వచ్చారా..? ప్రమాదస్థలాలను చూసేందుకు వచ్చారా..? అని ప్రశ్నించారు. సోమేశ్వర కొండ కూలేందుకు ఈ ప్రాంతంలో రిసార్టు నిర్మించడంతోనే ప్రమాదానికి కారణమైందన్నారు.

నేను సిద్దరామయ్య అభిమానిని..!

● ఇప్పుడు ఆయన మారిపోయారు
● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజుగౌడ



బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): 'రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి నాకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య అంటే చాలా అభిమానం.. అయితే ఆయనలో ఇప్పుడు చాలా మార్పు వచ్చింది' అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజుగౌడ పేర్కొన్నారు. బీదర్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఉన్నట్లు సిద్దరామయ్య ప్రస్తుతం లేరని అన్నారు. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.187 కోట్లలో రూ.87 కోట్లు అవినీతి జరిగిందని సీఎం బహిరంగంగా చెప్పారని అన్నారు. శాసనసభలోనూ, మీడియాతోనూ ఈ వాస్తవాన్ని అంగీకరించారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయంటూ ఓ జాబితాను విడుదల చేశారని అన్నారు. ఒకవేళ అప్పట్లో అవినీతి జరిగి ఉంటే ప్రభుత్వమే మీ చేతిలో ఉందని, ఎందుకు విచారణ జరపడం లేదని ప్రశ్నించారు. బ్లాక్‌మెయిల్ చేసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం కొనసాగినప్పుడు కాంగ్రెస్ పార్టీ తమపై 40శాతం కమీషన్ పొందుతున్నారని బహిరంగంగా ఆరోపణలు చేసిందన్నారు. ప్రస్తుతం ప్రతిశాఖలోనూ అవినీతి ఉందని, జిల్లా, తాలూకా స్థాయికి చేరిందన్నారు. నిధులు లేక అభివృద్ధి జరగడం లేదన్నారు. ఈ ప్రభుత్వం ఎంతోకాలం మనుగడ సాధించదని తేల్చి చెప్పారు.

ఉరకలేస్తున్న తుంగభద్ర

● 1.5 లక్షల క్యూసెక్కులకు పెరిగిన ఇన్‌ఫ్లో ● తుంగభద్ర క్రస్ట్‌గేట్లు ఎత్తి 996 క్యూసెక్కుల విడుదల ● నేడు తుంగభద్ర ఎగువ కాలువకు నీటి విడుదల ● లోతట్టు ప్రాంతాల్లోని గ్రామాల్లోకి చేరిన నీరు ● నదీపరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు



నిండుకుండలా తొణికిసలాడుతున్న తుంగభద్ర జలాశయం

బళ్లారి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం వరద నీటితో ఉరకలేస్తోంది. జలాశయం పైభాగంలో కురుస్తున్న వర్షాలకు వరద పోటెత్తింది. ఆదివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో లెక్కించిన నీటి లెక్కల ప్రకారం 1,30,500 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరుతోంది. ప్రస్తుతం డ్యాంలోకి 77.377 టీఎంసీల నీరు చేరింది. ఆదివారం రాత్రికి మరిన్ని టీఎంసీలు నీరు పెరిగే అవకాశం ఉంది. వివిధ కాలువలకు 3,213 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఆదివారం డ్యాంకు ఉండే క్రస్ట్ గేట్లు ఎత్తి నదికి 996 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నదికి మరింత నీరు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

కుండపోత వానలు

తుంగభద్ర జలాశయం ఎగువ ప్రాంతంలో కుండపోత వర్షం కురుస్తోంది. విజయనగర(హాస్పేట్) ప్రాంతంలోనూ శని, ఆదివారాల్లో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. గత ఏడాది కంటే ఈసారి జలాశయానికి వరద పోటెత్తింది. గత ఏడాది ఇదే నాటికి 13.71 టీఎంసీలు మాత్రమే నీరు ఉండేది. 2022లో వర్షాలకు క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. 2023లో వర్షాలు సరిగ్గా కురవని కారణంగా క్రస్ట్ గేట్లు తెరవలేదు. ఈ ఏడాది భారీ వర్షాలు కురుస్తుండడంతో ఇప్పటికే డ్యాంలోకి పూర్తి స్థాయిలో నీరు చేరింది.

నీట మునిగిన గ్రామాలు


తుంగభద్ర జలాశయం పరిసరాల్లో ఉండే గ్రామాలు నీట మునిగాయి. కొన్ని గ్రామాలు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. హర్పనహళ్లి, హగరీబొమ్మనహళ్లి పరిధిలో నదికి సమీపంలో ఉండే గ్రామాలు నీటిలో చిక్కుకున్నాయి. గ్రామాలకు వెళ్లడానికి, అక్కడి నుంచి బయటకు రావడానికి వీలు లేకుండా నడుంలోతు వరకూ నీటితో నిండిపోయాయి. ఇప్పటికే కొందరు గ్రామస్థులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. మరి కొందరు అక్కడే ఎత్తుగా ఉండే ప్రాంతాల్లో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకుని తలదాచుకున్నారు.

తుంగభద్ర బోర్డు అధికారుల హెచ్చరిక

తుంగభద్ర డ్యాంకు వరద నీరు పెరుగుతోంది. డ్యాం క్రస్ట్‌గేట్లు మరింత ఎత్తు పెంచుతూ నీటిని నదికి వదులుతామని తుంగభద్ర బోర్డు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం ఉదయం డ్యాం నుంచి 996 క్యూసెక్కులు నీటిని విడుదల చేశామని తెలిపారు. రాత్రికి మరింత నీటిని నదికి విడుదల చేస్తామని పేర్కొన్నారు. నదీపరివాహక ప్రాంతాల్లో ఉండే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పశువుల కాపర్లు, జాలర్లు ఎవరూ వేటకు వెళ్లరాదని తెలిపారు. నది ప్రాంతంలో పంటలు సాగుచేసుకుంటున్న రైతులు ఎవరూ నదిలోకి వెళ్లరాదని పేర్కొన్నారు.



పొలాల్లోకి ప్రవహించిన వరద



ఎన్‌ఆర్ కాలనీలో షిర్డీసాయిబాబాకు అలంకరణ

రాష్ట్ర వ్యాప్తంగా గురుపూర్ణిమ వేడుకలు

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం గురుపూర్ణిమ వేడుకలు సందడిగా సాగాయి. షిర్డీసాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలు ఆకట్టుకున్నాయి. నగరంలోని వందలాది ప్రాంతాల్లో షిర్డీసాయి బాబా ఆలయాలను అలంకరణలు చేశారు. జేపీనగర్‌లోని సత్యగణపతి షిర్డీసాయి ట్రస్టు ఆధ్వర్యంలో గురుపూర్ణిమ వేడుకలు జరిగాయి. ఆలయంలో పూలు పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. త్యాగరాజనగర్ ఎన్‌ఆర్ కాలనీలోని ఆలయంలో రంగు రంగుల పుష్పాలతో సాయిబాబాను కొలువుదీర్చారు. మల్లేశ్వరంతోపాటు ఆర్‌టినగర్, ఇందిరానగర్‌తోపాటు అన్ని ప్రాంతాల్లోనూ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

రేవణ్ణ నేతృత్వంలో హాసన్‌లో భారీ సభ

● కేంద్రమంత్రి కుమారస్వామి ప్రకటన

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): హాసన్ జిల్లాలో జేడీఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు రేవణ్ణ నేతృత్వంలోనే భారీ సభ ఏర్పాటు చేస్తామని కేంద్రమంత్రి కుమారస్వామి ప్రకటించారు. ఆదివారం హాసన్‌లో మీడియాతో మాట్లాడుతూ రేవణ్ణ కుటుంబంలో కొన్ని సమస్యలు ఉన్నాయని అన్నారు. రేవణ్ణ హాసన్ జిల్లాకు చేసిన అభివృద్ధిని ఎవరూ మరువరని తెలిపారు. ప్రజ్వల్, సూరజ్ జ్యుడీషియల్ కస్టడీలో ఉండడం వల్ల జేడీఎస్ కార్యకర్తలకు కొంత నిరాశ కలిగిందన్నారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపడంతోపాటు పార్టీని బలోపేతం చేసేందుకు భారీ సభ నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆయన సకలేశపుర తాలూకా దొడ్డతొప్పలు గ్రామాన్ని సందర్శించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారి హాసన్‌జిల్లాకు వచ్చానని అన్నారు. ఈ జిల్లాతో తమ సంబంధం మరువలేనిదన్నారు. హాసన్ జిల్లాలో ప్రతిపక్షనేత అశోక్‌తోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి సందర్శించారు. కేంద్ర మంత్రి కుమారస్వామి రెండు రోజులపాటు హాసన్, ఉత్తరకన్నడ జిల్లాల్లో పర్యటనలు చేశారు. వర్షపీడిత ప్రాంతాలను పరిశీలించారు.



సకలేశపుర తాలూకాలో కేంద్రమంత్రి కుమారస్వామి పర్యటన


పాఠ్యాంశాలతోపాటు నైతిక విలువలు బోధించండి

● పీఈఎస్ చాన్స్‌లర్ దొరస్వామి పిలుపు

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పాఠ్యాంశాలతోపాటు నైతిక విలువలు బోధించాలని అప్పుడే విద్యార్థులు ఉత్తమ విలువలు కల్గిన పౌరులుగా ఎదుగుతారని పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి తెలిపారు. ఆదివారం యూనివర్సిటీలో కామర్స్, డిజైన్, ఎకనమిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ లా, మేనేజ్‌మెంట్, సైకాలజీతోపాటు డిగ్రీ కోర్సులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి దొరస్వామి మాట్లాడుతూ కేవలం అత్యధిక జీతాల కోసం ఉద్యోగం పొందాలనే తపన వీడాలని, జీవితంలో పాటించాల్సిన విలువలను పెంపొందించుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వం, సంప్రదాయాలను విద్యార్థులు అర్థం చేసుకోవాలన్నారు. నైతిక విలువలు లేకపోవడంతోనే నేరాల సంఖ్య పెరుగుతోందని విచారం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థికి జ్ఞానంతోపాటు లక్ష్యం ఉండాలన్నారు. తోటి వ్యక్తులపట్ల గౌరవం, మానవత్వం కూడా పెంపొందించుకోవాలని సూచించారు. విద్యా ప్రమాణాల్లో గణనీయమైన మార్పు వచ్చిందన్నారు. చార్టెర్డ్ అకౌంటెంట్లకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉందని తెలిపారు. అకడమిక్ ఎక్సలెన్సీ, సాంస్కృతిక విలువలను రెండింటినీ సమపాళ్లలో పొందాలని సూచించారు. ప్రో-చాన్సలర్ ప్రొఫెసర్ జవహర్ మాట్లాడుతూ పీఈఎస్ విద్యాసంస్థలు ప్రగతి శిఖరాగ్రానికి చేరేందుకు నిరంతరంగా గుణాత్మకతకు ప్రాధాన్యత ఇవ్వడమే కారణమన్నారు. ప్రతి విద్యార్థిని ఉన్నత స్థాయికి చేర్చాలనే లక్ష్యంతో బోధనలు అమలు చేస్తున్నామన్నారు. పీఈఎస్‌లో క్యాంపస్ సెలెక్షన్స్ అనేది నిరంతర ప్రక్రియగా సాగుతోందన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రైల్వే మంత్రిత్వశాఖ డివిజనల్ ఫైనాన్స్ మేనేజర్, పీఈఎస్ పూర్వ విద్యార్థి ఐఏఎస్ శ్రేయస్ హోసూరు మాట్లాడుతూ ఇక్కడి చదువు తన కెరీర్‌ను మార్చిందన్నారు. కొత్త జ్ఞానాన్ని అన్వేషించడంలో అధ్యాపకుల సహకారం మరువలేమని అన్నారు. గడిచిన కొన్నేళ్లతో పోల్చితే నెట్‌వర్కింగ్, డిజిటల్ ఇంజనీరింగ్ విధానాల్లో అనూహ్యమైన మార్పులు వస్తున్నాయని, వాటికి అనుగుణంగా నైపుణ్యత సాధించాలని పిలుపునిచ్చారు. విజయం అనేది ఒక రాత్రిలోనూ, ఒక సంవత్సరంలోనూ రాదని, నిరంతరంగా కష్టపడే విధానం, తెలుసుకోవాలనే తపనతోనే సాధ్యమన్నారు. వైస్‌చాన్సలర్ డాక్టర్ జె. సూర్యప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కేఎస్ శ్రీధర్, సీఓఓ అజయ్‌కుమార్, డీన్ శైలశ్రీ హరిదాస్ తదితరులు పాల్గొన్నారు. 5వేల మందికి పైగా విద్యార్థులు వారి తల్లిదండ్రులు భాగస్వామ్యులయ్యారు.



జ్ఞాపికలు అందచేస్తున్న పీఈఎస్ చాన్స్‌లర్ దొరస్వామి తదితరులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.41	1,593.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	1, 12,101	13340
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	2324	93
సామర్థ్యం (టీఎంసీలు)	74.58	13.72

ఉత్తమ రైతులకు సన్మానం



గోవిందప్ప నాయకను సన్మానిస్తున్న చర్చి ఫాదర్

బళ్లారిరూరల్, జూలై 21: బళ్లారి నగరంలో ఇంద్రనగర్ మేరీమాత చర్చి సమీపంలో ఉన్న వీఎస్ స్కూల్ ఆవరణలో చర్చి ఫెస్టివల్ సందర్భంగా చర్చి ఫాదర్ ఉత్తమ రైతులైన ఎం గోవిందప్ప నాయకతో పాటు హనుమంతప్ప, వీరేష్, దుర్గన్న, రుద్రప్పలను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రైతులతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

సుధా సర్కిల్ రోడ్డులో చెట్ల నరికివేత



రోడ్డుపక్కన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

బళ్లారి సిటీ, జూలై 21: నగరంలోని సుధా క్రాస్ సర్కిల్ రోడ్డు విస్తరణ కోసం ఆదివారం రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లను నరికివేశారు. దాంతోపాటు ఆదివారం విద్యుత్ స్తంభాల తొలగింపు పనులు కూడా చేపట్టారు. ఈ కారణంగా రాత్రి 9గంటల వరకు ఈ రహదారిపై రాకపోకలను నిషేధించారు. చాలా ఏళ్లగా రోడ్డుకిరువైపులా ఉండే చెట్లు పాదచారులకు నీడ, మంచి గాలిని ఇస్తుండేవనీ, వాటిని తొలగించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కుష్టు వ్యాధి నివారణకు కృషి



మాట్లాడుతున్న వైద్య నోడల్ అధికారి ప్రహ్లాదరెడ్డి

సిరుగుప్ప, జూలై 21: కుష్టు వ్యాధి నివారణకు వైద్య సిబ్బంది పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య నోడల్ అధికారి ప్రహ్లాదరెడ్డి అన్నారు. శనివారం సిరుగుప్ప పట్టణ ప్రభుత్వాస్పత్రిలో తాలుకా పంచాయతీ, జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణపై వైద్యసిబ్బందికి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక చికిత్స ఏర్పాటు చేయాలని సూచించారు. తాలుకాలో ఎక్కడైనా వ్యాధిగ్రస్తులు వుంటే అక్కడికే వెళ్లి చికిత్స చేయాలన్నారు. ఈ సందర్భంగా డీటీ రాఘవేంద్ర, ప్రభుత్వాస్పత్రి ఇన్‌చార్జ్ మహమ్మద్ ఖాసీమ్, ప్రభుత్వాస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంఘం నూతన అధ్యక్షుడిగా నౌషద్ అలీ



నౌషద్ అలీని సన్మానిస్తున్న పదాధికారులు

సిరుగుప్ప, జూలై 21: సిరుగుప్ప తాలుకా జర్నలిస్టు సంఘానికి రెండోసారి అధ్యక్షుడిగా మహమ్మద్ నౌషద్ అలీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సిరుగుప్పలో హామీ అబ్దుల్ నబీ అధ్యక్షతన పదాధికారులను ఎన్నుకొన్నారు. ప్రధాన కార్యదర్శిగా నాగేష్, గౌరవాధ్యక్షులుగా మల్లికార్జున, కార్యవర్గ సభ్యులుగా మహమ్మద్ ఇబ్రహీం, న్యాయవాది అబ్దుల్ సాబ్, జైసింగాల్ ఎన్నికయ్యారు.

శ్రీ గురుభ్యోనమః

అదే భక్తి..



కోట షిర్డీ సాయి ఆలయంలో...

విశాల్ నగర్ ఆలయంలో ప్రత్యేకాలంకరణలో షిర్డీసాయిబాబా

బళ్లారిలో గురుపూర్ణిమ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఎంజీ రోడ్డు, పటేల్‌నగర్‌లో అన్నప్రసాదాల పంపిణీ చేపట్టారు.

నీవే సర్వం.. సాయీ..



తరగని ఆదరణ



సిరిగుప్పలో సాయిబాబాకు పుష్పాలంకార సేవ



కోట ఆలయంలో అన్న ప్రసాదాల పంపిణీ

ఉలిగమ్మ తల్లీ నమోనమః



కృష్ణా, తుంగభద్రలకు పోటెత్తిన వరద

బళ్లారి, రాయచూరు, జూలై 21: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల తుంగభద్ర, కృష్ణానదులకు వరద పోటెత్తింది. నారాయణపూర్ జలాశయం నుంచి 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో రాయచూరు జిల్లాలోని లింగసుగూరు, దేవదుర్గ, రాయచూరు తాలూకాల పరిధిలోగల తీర గ్రామాలకు అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు. లింగసుగూరు తాలూకాలోని శీలహళ్ళి వంతెన పూర్తిస్థాయిలో నీటి మునిగే ప్రమాదం ఉండడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిపివేసేందుకు అధికారులు ఇప్పటికే సమాయత్తమయ్యారు. దీంతో పాటు దేవదుర్గ తాలూకాలోని మరో వంతెన కూడా నీట మునిగే ప్రమాదం ఉండడంతో అధికారులు ఇప్పటికే అక్కడ పోలీస్ పహారా ఏర్పాటు చేసి రాకపోకలపై నిఘా ఉంచారు. దీంతో పాటు రాయచూరు తాలూకాలోని డొంగరాంపూర్ మొదలుకొని గుర్జాలా, కరదోణ తదితర నది తీర గ్రామాల ప్రజలకు ఇప్పటికే చాటింపు వేసి హెచ్చరికలు జారీ చేశారు. మహారాష్ట్ర నుంచి ఆలమట్టిలోకి వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో నారాయణపూర్ జలాశయంలో ఇప్పటికే 24 గేట్‌లను తెరిచిన అధికారులు మరిన్ని గేట్‌లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. జిల్లాను ఆనుకుని ప్రవహిస్తున్న మరో నది తుంగభద్రలోను వరద ప్రవాహం పెరగడంతో తుంగభద్ర నది తీరగ్రామాల ప్రజలకు అధికారులు ఇప్పటికే పలు సూచనలు చేశారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యాంలో 77.377 టీఎంసీల నీరు చేరింది. ఆదివారం రాత్రికి మరింత నీటిమట్టం పెరిగే అవకాశం ఉంది. వివిధ కాలువలకు 3213 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. డ్యాంకు ఉండే క్రస్ట్ గేట్లు ఎత్తిన నదికి 996 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వరద ఇలాగే కొనసాగితే నదిలోకి మరింత నీరు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.



తుంగభద్ర నదీ తీరంలో రోడ్లపైకి చేరిన వరద నీరు

నీట మునిగిన గ్రామాలు

వరద కారణంగా టీబీ డ్యాం పరిసరాల్లో ఉండే గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. హర్పనహళ్లి, హగరీబొమ్మనహళ్లి తాలూకాల పరిధిలో నదికి సమీపంలో ఉండే గ్రామాలకు వెళ్లడానికి అలాగే గ్రామం నుండి బయటకు రావడానికి వీలు లేకుండా పోయింది. కొందరు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. మరి కొందరు అక్కడే ఎత్తుగా ఉండే ప్రాంతాల్లో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకుని తలదాచుకున్నారు. వరద తగ్గాక తిరిగి ఇంటికి చేరుకోవాలనే ఆశతో అక్కడే ఉన్నట్లు హర్పనహళ్లి గ్రామస్తులు తెలిపారు.

వచన యుగపు ఆధ్యాత్మికవేత్త అప్పన్న

- కిష్కింధ వర్సిటీ ప్రొఫెసర్ మంజునాథ్

బళ్లారి సిటీ, జూలై 21: పన్నెండవ శతాబ్దపు వచన యుగంలో సామాన్య ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను వ్యాప్తి చేసిన మహోన్నత వ్యక్తి శివశరణ హడపద అప్పన్న అని కిష్కింధ విశ్వవిద్యాలయ ఆచార్యులు ప్రొఫెసర్ మంజునాథ్ అన్నారు. నగరంలో ఆదివారం కన్నడ సాంస్కృతిక శాఖ, మహాకార్పోరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో ఏర్పాటు చేసిన అప్పన్న జయంతి కార్యక్రమంలో ఆయన ప్రత్యేక ఉపన్యాసం చేశారు. ఆయన యువకవులకు స్ఫూర్తిదాయకమన్నారు. సామాన్యులు తమ జీవిత పరమార్థం తెలుసుకుని పెద్దలను గౌరవించి నిరాడంబరంగా జీవించాలన్నదే ఆయన ఆకాంక్ష అని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శంబులింగ శివాచార్య స్వామిజీ మాట్లాడుతూ హడపద అప్పన్న తన శరీరం, మాట మనస్సుతో ధర్మాన్ని గౌరవించాలన్నారు. పన్నెండవ శతాబ్దానికి చెందిన ప్రముఖ వచన కారులలో ఒకరైన అప్పన్న తన వచన తత్వాల ద్వారా సూర్యచంద్రులు ఉన్నంత కాలం అమరత్వం ఉంటుందని చెప్పారు. జగజ్యోతి బసవన్న అనుచరుడైన అప్పన్న తన కీర్తనల ద్వారా సమాజంలో సమానత్వం, ఐకమత్యాన్ని చాటారని సమాజ పరివర్తనకు ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన మాదిరిగా మానవులు మానవతా గుణాలు, నైతిక విలువలు అలవర్చుకుని ఆదర్శప్రాయమైన జీవితాలను గడపాలన్నారు. ఈసందర్భంగా అప్పన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వసంతకుమార్ బృందం వచన సంగీతాన్ని ఆలపించారు.

వేదిక కార్యక్రమానికి ముందు నగరంలోని హెచ్‌ఆర్ గవియప్ప సర్కిల్ నుంచి డాక్టర్ జోలదరాశి దొడ్డనగౌడ రంగమందిరం వరకు అప్పన్న చిత్రపటాన్ని ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు నాగరాజు, జిల్లా హడపద అప్పన్న సేవాసంఘం అధ్యక్షుడు రుద్రప్ప, సంఘం నాయకులు కొట్రేశ్, తిప్పేస్వామి, కన్నడ సాంస్కృతిక శాఖ సిబ్బంది, సవితాసమాజ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శంభులింగ శివాచార్య

అప్పన్న తత్వ సిద్ధాంతాలను ఆచరించాలి

సిరుగుప్ప: అడపద అప్పన్న తత్వసిద్ధాంతాలను పాటిం చాలని డిప్యూటీ తహసీల్దార్ సిద్ధార్థ కారంజి తెలిపారు. ఆదివారం సిరుగుప్ప పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో అడపద అప్పన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు అనుమేష, శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఇంద్రజాలాన్ని ప్రదర్శిస్తున్న ప్రకాశ్ హెమ్మాడి

బళ్లారి సిటీ,జూలై 21: ప్రతినెలా మూడో శనివారం నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలు కళాకారుల ప్రతిభను గుర్తించేందుకు వారి విజయాలను ప్రోత్సహించడానికి మంచి అవకాశం అని అదనపు కలెక్టర్ మహ్మద్‌జుబేరా అన్నారు. నగరంలోని డాక్టర్ రాజకుమార్ రోడ్డులోని సాంస్కృతిక సముదాయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాంస్కృతిక సముదాయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో నెలవారీ సంస్కృతిక కార్యక్రమాలు, కళలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రకాశ్ హెమ్మాడి జానపద మాయజాలంతో ప్రేక్షకులను ఉర్రూతలూరించారు. తదుపరి సిరుగుప్ప తాలూకాలోని దాత్రి రంగా ఇనిస్టిట్యూట్ వారు ప్రదర్శించిన శ్రీకృష్ణసంధానం అనే హాస్య నాటకాన్ని కళాభిమానులు అభినందించారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, సాంస్కృతిక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా వీరశైవ మహాసభ ఎన్నికలు

కంప్లి, జూలై 21 : ఎట్టకేలకు జిల్లాలోని వీరశైవసమాజం జిల్లా సమితి ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సన్నాపురంలో జరిగిన ఈ ఎన్నికల్లో 573 మంది ఓటర్లు వుండగా 439 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారి చంద్రశేఖర్ తెలిపారు. అధ్యక్షస్థానానికి ఒక ఓటు, మహిళా సంఘానికి పది ఓట్లు, పురుషులకు 20 ఓట్లు వేయాల్సి వుండగా ఎన్నికలకు సమయం ఎక్కువ తీసుకుంది.

అడపద అప్పన్నను ఆదర్శంగా తీసుకోవాలి



కురుగోడులో అప్పన్నజయంతి నిర్వహిస్తున్న అధికారులు

కంప్లి, జూలై 21: అడపద అప్పన్నను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కురుగోడు తహసీల్దార్ రాఘవేంద్ర కోరారు. కంప్లి పట్టణంలో కూడా అప్పన్న జయంతిని తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా జరిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివరాజు, సమాజ పదాధికారులు, అశోక్, షణ్ముఖప్ప, మల్లేశప్ప, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే జేఎన్ గణేష్

కంప్లి, జూలై 21 : గురుపూర్ణిమ సందర్భంగా గ్రామాల్లో, పట్టణాల్లో షిర్డీసాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కంప్లి పట్టణం సత్యనారాయణ పేట షిర్డీసాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పాల్గొని సాయినాథునికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా ఆలయాలు

తోరణగల్లు, జూలై 21 : సండూరు తాలుకా వ్యాప్తంగా గురుపూర్ణిమ సందర్భంగా సాయి నాథుని దేవస్థానాలు భక్తులతో కిటకిటలాడాయి. కురేకుప్ప పట్టణానికి సమీపంలో ఉన్న సాయిబాబా దేవస్థానంలో వివిధ పూజలు నిర్వహించి సాయినాథుడిని విశేషంగా అలంకరించారు. దేవాలయం వేలాది మంది భక్తులతో కిటకిటలాడింది. అలాగే భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. ఉదయం నుంచి వర్షం వస్తున్నలెక్క చేయకుండా భక్తాదులు సాయినాథుని దర్శనం చేసుకున్నారు.

హోసూరు జోన్

గురు పూర్ణిమ సందర్భంగా భక్తుల గిరి ప్రదక్షిణ



బ్రహ్మ, విష్ణు, శివుడు అనే మూడు కొండలను చుట్టి వస్తున్న భక్తులు

హోసూరు, జూలై 21 : హోసూరులో ఆదివారం బ్రహ్మ విష్ణువు శివుని మూడు పర్వాతాల చుట్టూ గిరివలం చేసిన అరుళ్మికి శ్రీ బ్రహ్మ కొండ ఫౌండేషన్ ప్రతినిధులు గురుపూర్ణిమ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. హోసూరు జాతీయ రహదారిపై ఉన్న బండాంజనేయ ఆలయం సమీపం నుంచి బయల్దేరి వెంకటాచలపతి కొండ చుట్టు తిరిగి, పాత బస్టాండు , ముల్లై నగర్, గాయత్రి అమ్మన్ దేవాలయం, అశోక పిల్లర్‌రోడ్డు, రాయకోట రోడ్డు మీదుగా తిరిగి బండాంజనేయ ఆలయ సమీపానికి చేరుకున్నారు. గిరి ప్రదక్షిణం సందర్భంగా ప్రజలు రోగాలు లేకుండా జీవించాలని, మంచి వర్షాలు కురిసి చెరువులు నిండాలని, బ్రహ్మదేవుడిని ప్రార్థించారు. దీనిని ట్రస్టీలు ముత్తులక్ష్మి, రాజేంద్రన్, సొన్నప్ప నిర్వహించారు.

తాగునీరు సక్రమంగా సరఫరా చేయాలి

హోసూరు, జూలై 21: హోసూరు కార్పొరేషన్‌లోని 24 వ వార్డు రాంగనర్‌లో తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని మహిళలు ఆగ్రహించారు. కోపోద్రికులైన మహిళలు పెద్ద సంఖ్యల్లో ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. మున్సిపల్ కార్పొరేషన్ రాంనగర్ పార్క్ డెంకణీకోట రోడ్డుపై బైఠాయించి గతంలో వేసవిని ఒక కారణంగా చూపి నీరు విడుదల చేయలేదన్నారు. అయితే మంచి వర్షాలు కురిసి చెరువులు నిండిఉన్న కూడా తాగునీరు అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

దేవాలయాల్లో దీపం కూడా పెట్టడంలేదు



హోసూరు రాంగనర్ అన్నా విగ్రహం వద్ద హిందూ మున్నణి నిరసన

హోసూరు, జూలై 21: ప్రభుత్వ ఆదీనంలో ఉన్న వేలాది దేవాలయాలు శిథిలావస్థకు చేరకున్నాయని, వాటిల్లో ఒక్కపూట కూడా పూజ చేయడం లేదని హోసూరు రాంగనర్ అన్నా విగ్రహం దగ్గర, మత్తిగిరిలో హిందూ మున్నణి నిరసనలు ప్రదర్శన నిర్వహించింది. ఆ సమయంల్లో అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు ప్రదర్శనలో పాల్గొన్న 36 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రదర్శనకు నగర అధ్యక్షుడు శశికుమార్ అధ్యక్షత వహించారు. జిల్లా ఇన్‌ఛార్జీ ఉమేష్ అధ్యక్షత వహించారు. ప్రభుత్వ ఆదీనంలోని వేలాది దేవాలయాలు శిథిలావస్థకు చేరకున్నాయని దర్శన రుసుము, పూజ రుసుము అపరాధ రుసుము, అంటూ అనేక రుసుములు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిరసన కార్యక్రమంల్లో జిల్లా కార్యదర్శి శేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రిన్స్, విజి, ఇన్‌చార్జిలు దివాకర్, నవీన్, చంద్రు, కార్తీక్, శివ, మంజునాథ్ పాల్గొన్నారు.



నీటి కోసం రోడ్డుపై బైఠాయించిన రాంనగర్ ప్రాంత ప్రజలు

ఆర్టీపీఎస్‌లో తగ్గిన విద్యుత్ ఉత్పత్తి

రాయచూరు, జూలై 21: రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల విద్యుత్‌కు డిమాండ్ తగ్గడంతో పాటు జలవిద్యుత్ ఉత్పత్తి పెరిగిన నేపథ్యంలో జిల్లాలోని ఆర్టీపీఎస్‌లో ఉత్పత్తి తగ్గించారు. మొత్తం 8 యూనిట్‌లలో ప్రతిరోజు 1720 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉండగా 1,3,7వ యూనిట్‌లలో ఉత్పత్తిని నిలిపివేశారు. దీంతో ఆదివారం కేవలం 724 మెగావాట్ల ఉత్పత్తి మాత్రమే జరిగినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర అవసరాలకు తగిన రీతిలో జలవిద్యుత్ ఉత్పత్తి పెరగడంతో ఆర్టీపీఎస్‌లో మూడు యూనిట్‌లను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు.



రాయచూరు థర్మల్ విద్యుత్ కేంద్రం (ఫైల్)

క్రీడలతో ఒత్తిడి దూరం: డీసీ నితీష్

రాయచూరు, జూలై 21: వృత్తి జీవితంలో నిత్యం ఒత్తిడికి గురైయ్యే పాత్రికేయులు క్రీడల్లో పాల్గొనడం వల్ల ఒత్తిడిని జయించవచ్చని జిల్లాధికారి నితీశ్ అన్నారు. కర్ణాటక వర్కింగ్ జర్నలిస్టల యూనియన్ ఆధ్వర్యంలో నగరంలోని మహాత్మగాంధి స్టేడియంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీలను ఆదివారం జిల్లాధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డీసీ, ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియాకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందన్నారు. అదే సమయంలో ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న పాత్రికేయులు తమ వ్యక్తిగత జీవితానికి తగిన ప్రాధాన్యతనివ్వాలన్నారు. అదే సమయంలో ఒత్తిడికి గురికాకుండా క్రీడలు, వ్యాయామం ఇతరత్ర యోగా వంటి సాధనల ద్వారా తమ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లాధికారి నితీశ్

లింగసుగూరు జట్టుపై సింధనూరు గెలుపు

మహాత్మగాంధి స్టేడియంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో తొలిరోజు లింగసుగూరు-సింధనూరు జట్టు హోరాహోరిగా తలపడ్డాయి. ఈ పోటీలో లింగసుగూరు జట్టు పై ఆరు వికెట్‌ల తేడాతో సింధనూరు జట్టు విజయం సాధించింది. తొలుత టాస్ ద్వార బౌలింగ్ ఎంచుకున్న లింగసుగూరు జట్టు ఆరు ఓవర్‌లలో నాల్గు వికెట్‌లు నష్టపోగా అనంతరం బ్యాటింగ్ చేసిన సింధనూరు జట్టు 26 రన్స్ తేడాతో విజయాన్ని సాధించింది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

దాశరథి (వర్ధంతి)



పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకుని తెలంగాణ విముక్తికోసం ఉద్యమించిన 'కళాప్రపూర్ణ' పురస్కార గ్రహీత దాశరథి కృష్ణ మాచార్య 1925 జూలై 22న వరంగల్ జిల్లా చిన్నగూడూరు గ్రామంలో జన్మించారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని గర్వంగా ప్రకటించి ఇప్పటి ఉద్యమానికి ప్రేరణ అందిస్తున్న కవి దాశరథి. ప్రజల కన్నీళ్ళను 'అగ్ని ధార'గా మలిచి నిజాం పాలనపైకి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూభాషల్లో మంచి పండితుడు. ఉపాధ్యాయుడిగా, పంచాయతీ ఇన్ స్పెక్టర్‌గా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేశారు. సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో కృషి చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, కవిసింహ, అభ్యుదయ కవితా చక్రవర్తి బిరుదులు పొందారు. 1987 నవంబరు 5న కన్నుమూశారు.

ముకేశ్‌చంద్ మాథూర్ (జయంతి)




హిందీ సినీ రంగంలో పేరొందిన ప్రముఖ నేపథ్య గాయకుడు ముకేశ్‌చంద్ మాథూర్ 1923 జూలై 22న ఢిల్లీలో జన్మించారు. కేఎల్ సైగల్ స్ఫూర్తితో పాటలు పాడడంలో తనదైన శైలిలో రాణించాడు. ఎక్కువ పాటలు శంకర్-జైకిషన్, కల్యాణ్‌జీ- ఆనంద్‌జీ సంగీత దర్శకత్వంలో పాడారు. రాజ్‌కపూర్, మనోజ్‌కుమార్, దిలీప్‌కుమార్, సునిల్‌దత్ వంటి ప్రముఖ హీరోలకు పాటలు పాడారు. నేషనల్, ఫిల్మ్ ఫేర్ అవార్డులు, బెంగాల్ ఫిల్మ్ జర్నలిస్టు అసోసియేషన్ నుంచి ఉత్తమ నేపథ్య గాయకుడి అవార్డులు అందుకున్నారు. 1976 ఆగస్టు 27న అకస్మికంగా మృతి చెందారు.

డీకే జయరామన్ (జయంతి)



డీకేజేగా పేరొందిన 'సంగీత కళానిధి' గ్రహీత డీకే జయరామన్ 1928 జూలై 22న కాంచీ పురంలో జన్మించారు. తండ్రి, అక్కల ప్రోత్సాహంతో సాహిత్యం సంగీతంలో రాణించారు. ముత్తుస్వామి దీక్షితుల రచనలకు ప్రాచుర్యం కల్పించారు. కర్ణాటక సంగీతానికి వైభవం తెచ్చేందుకు కృషి చేశారు. 1991 జనవరి 18న కన్నుమూశారు.

అనంతకుమార్ (జయంతి)



హెగ్గనహళ్ళి నారాయణ శాస్త్రి అనంతకుమార్ 1959 జూలై 22న బెంగళూరులో జన్మించారు. బీజేపీలో సీనియర్ నేత. రెండు దశాబ్దాలపాటు బెంగళూరు దక్షిణ నుంచి ఎంపీగా కొనసాగారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, ఎరువులు, రసాయన శాఖ మంత్రిగా వ్యవహరించారు. ప్రజలకు తక్కువధరలో మందులు అందించే 'జన ఔషధి కేంద్రాల' ఏర్పాటులో ఎంతో కృషి చేశారు. సువిధ పథకం ద్వారా బయో డిగ్రేడబుల్, పర్యావరణ హిత శానిటరీ ప్యాడ్స్ అందుబాటులోకి తేవడంలో, ఎరువుల పంపిణీలోనూ విప్లవాత్మక చర్యలు చేపట్టారు. ఆయన చేపట్టిన అదమ్య చేతన సంస్థ ద్వారా నేటికీ సామాజిక సేవలు కొనసాగుతున్నాయి. పదవిలో ఉండగా అకస్మాత్తుగా 2018 నవంబరు 12న కన్నుమూశారు.

బోవి కార్పొరేషన్ అవినీతిలో నాపేరు ప్రస్తావన సరికాదు

» సీఎంకు బీజేపీ ఎంపీ లేఖ

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బోవి అభివృద్ధి కార్పొరేషన్‌లో బసవరాజ్ బొమ్మై సీఎంగా ఉన్నప్పుడు 87 కోట్లరూపాయల అవినీతి జరిగిందని నా పేరు ప్రస్తావించడం సరికాదని ఉడుపి బీజేపీ ఎంపీ కోట శ్రీనివాస పూజారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎం సిద్దరామయ్యకు శనివారం లేఖ రాశారు. బోవి అభివృద్ధి కార్పొరేషన్‌లో 87 కోట్ల రూపాయల అవినీతి జరిగి ఉంటే మీ ప్రభుత్వమే కొన సాగుతోందని, ముఖ్యమంత్రిగా సీబీఐ ద్వారా విచారణ జరిపించేలా లేఖలో కోరారు. సీబీఐ విచారణ అంగీ కరించకుంటే విధానసౌధ ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేస్తానని కోట శ్రీనివాసపూజారి హెచ్చరించారు. శుక్రవారం శాసనసభలో నాపేరు ప్రస్తావించారని, నా రాజకీయ ప్రస్థానంలో అవినీతికి తావులేదని కోట శ్రీనివాసపూజారి లేఖలో ప్రస్తావించారు.

బ్రిగ్నేర్ రాయబారిగా చెఫ్ వికాస్ ఖన్నా

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వంటసామగ్రి రంగంలో పేరొందిన బ్రిగ్నేర్ సంస్థకు ప్రముఖ చెఫ్ వికాస్ ఖన్నా రాయబారి అయ్యారు. ఈమేరకు కొత్త ఉపకరణాలను విడుదల చేశారు. ట్రై - ఫ్లై, కాస్ట్ ఐరన్, అత్యాధునిక సిరామిక్ కోటింగ్‌తో వండుకునేందుకు అవసరమైన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకొచ్చా మన్నారు. అర్జంట్ మల్టిఫ్రై పాన్, మల్టి క్యాసోరాల్ తోపాటు రైస్ అండి, గోల్డ్‌సెట్ వంటి ఉపకరణాలు తీసుకొచ్చినట్టు కంపెనీ ఎండీ, సీఈఓ ఉమేశ్‌గుప్త ప్రకటించారు. బెంగళూరులో ఆదివారం ఉపకరణాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భారతీయ సంప్రదాయంలో వంటకాలు వండడం కూడా ఓ కళ అన్నారు. అందుకే ఆరోగ్యానికి మేలు చేకూర్చేలాంటి వంటగది ఉప కరణాలను మార్కెట్‌లోకి తీసుకొచ్చామన్నారు.

సంబరంగా గంధోత్సవం

చింతామణి, జూలై 21: పట్టణంలోని 15వ వార్డు టిప్పు నగర్ కురుబూరు వీధి సమీపాన గల హజరత్ గౌస్‌పాక్ నశాన్ దర్గా గంధోత్సవం శుక్ర, శనివారాలలో సంబరంగా జరిగింది. వార్డుకు చెందిన సయ్యద్ షబ్బీర్ పాషా సంయుక్త ఆధ్వర్యంలో గంధోత్సవాన్ని టిప్పునగర్‌లోని హజరత్ ముస్తఫా షా ఖాద్రి, హజరత్ బీబీ ఫాతిమా దర్గానుంచి మెరవణిగా వార్డు పుర వీధులలో గంధోత్సవం సాగింది. తొలుత గంధంతో అభిషేకం చేసి మల్లెపూల చాదర్‌ను సమర్పించారు. అనంతరం భక్తులకు మిఠాయిలు పంపిణీ చేశారు. సూఫి దుర్వేశ్ సయ్యద్ మైనుద్దీన్ షా రఫాయి ఫాతెహా కార్యక్రమం నిర్వహించారు. కొంతమందది భక్తులు కన్నులు, నాలుకకు కమ్మీని గుచ్చుకుని సాహసప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా బాసిత్ షా ఖాదరి, ఖలందర్ షా ఖాదరి, ముస్తాక్ అహ్మద్ షా ఖాదరి, సయ్యద్ మొయినుద్దీన్ షా రఫాయి తదితరులు పాల్గొన్నారు.

గురువుతోనే మోక్షమార్గ సాధన

» గురుపూజా సంగీతోత్సవంలో కైవార ధర్మాధికారి డాక్టర్ జయరాం



రుద్రాక్ష నాట్యాలయ బృందం భరతనాట్య ప్రదర్శన

చింతామణి, జూలై 21: గురువుతోనే మోక్షమార్గ సాధన సాధ్యమని, శిష్యుడికి మోక్షమార్గాన్ని ఉపదేశించడం ద్వారా మహాత్ముడు అవుతాడని కైవార క్షేత్ర ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కైవార యోగి నారేయణమఠంలో గురుపూర్ణిమను పురస్కరించుకుని ఏర్పాటైన గురుపూజా కార్యక్రమంలో గురువుల సందేశాన్ని ప్రబోధించారు. అరణ్యంలో సంచరించేవేళ ఎన్నో దారులు ఉంటాయని అయితే చేరాల్సిన లక్ష్యమైన మోక్షానికి వాటివల్ల సాధ్యం కాదన్నారు. ఇలా మోక్ష రహస్యాన్ని గురువులే ఉపదేశించాల్సి ఉంటుందని తాతయ్య స్పష్టంగా చెప్పారన్నారు. భవ బంధాలనుంచి ముక్తి పొందడానికి పలు ఉపదేశాలు ఉన్నాయని, సాధకుడు తాను ఏ ఉపదేశం ద్వారా ఏ మార్గాన్ని అనుసరించాలనేది గందరగోళం తొలగించుకునేందుకు గురువు ఉపదేశంతో నివారణ వీలవుతుందన్నారు. గురుపూజా సంగీతోత్సవంలో గోష్ఠిగాయనం శాస్త్రీయంగా విద్వాంసులచే సాగింది. నారేయణ తాతయ్యకు అభిషేకం, రాజోపచారాలు, అష్టావధాన సేవ సమర్పించారు. పంచామృతాభిషేకం, మంగళద్రవ్యాలతో అభిషేకం చేశారు. అలంకరణ అనంతరం మహామంగళారతి సమర్పించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాలనుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇదే సందర్భంగా బ్రహ్మాండపురి శతక యోగదృష్టి, శ్రీరామభవతారక మంత్ర యోగసార అనే రెండు పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రముఖ మృదంగ విద్వాంసుడు వి ప్రవీణ్‌ను సన్మానించారు. సంగీత కచేరీలో అనంతకృష్ణశర్మ బృందంచే లయలహరి తాళవాద్యం, మంజుళా జగదీశ్, ఆశా మంజునాథ్, చింతామణి సంగీత స్కూల్ పద్మావతి బృందం, చింతలపల్లి సోమశేఖర్, యోగి నారేయణ మహిళా బృందం తదితరులు ప్రదర్శనలు సభికులను అలరించాయి. సాయంత్రం కూడా సంగీత కచేరి కొనసాగింది. గురుపూజా మహోత్సవంలో మంత్రులు డాక్టర్ ఎంసీ సుధాకర్, కేహెచ్ మునియప్ప, మాజీ ఎమ్మెల్యే వీ మునియప్ప, డాక్టర్ జోస్యుల సదానంద శాస్త్రి, కైవార ట్రస్టు పదాధికారులు పాల్గొన్నారు.



కైవార తాతయ్యకు విశేష పూజలు

రాఘవేంద్రస్వామి సన్నిధిలో విశేష పూజలు

» షిర్డీసాయిబాబా ఆలయాల్లో సందడి



జయనగర్‌లో సత్యనారాయణస్వామి వ్రతం


బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గురుపూర్ణిమను పురస్కరించుకుని బెంగళూరు నగరం సహా పలు ప్రాంతాల్లో విశేషపూజా కార్యక్రమాలు సాగాయి. జయగనర్ ఐదో బ్లాక్‌లోని రాఘవేంద్ర స్వామి మఠంలో ఆదివారం సత్య నారాయణస్వామి పూజలు చేశారు. మఠం సీనియర్ మేనేజర్ వాదీంద్రాచార్య నేతృత్వంలో పూజా కార్యక్రమాలు సాగాయి. బృందావనానికి అభిషేకం, మూల విరాట్టుకు రత్నకవచ, సువర్ణ కవచ అలంకరణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో..

బాగేపల్లి: పట్టణంలోని షిర్డీసాయి బాబా మందిరంలో గురుపూర్ణిమా మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. బాబాకు క్షీరాభిషేకం, అలంకరణ అనంతరం మహా మంగళారతి సమర్పించారు. పెద్దసంఖ్యలో విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు ప్రవీశ్‌పాండే నేతృత్వంలో ధార్మిక కార్యక్రమాలు సాగాయి. విష్ణుసహస్రనామ పారాయణ, మహిళలు భజనగీతాలు ఆకట్టుకుంది. ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు బాబురెడ్డి, ప్రభాకరరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గూళూరు రమేశ్‌బాబు, లక్ష్మీ నరసింహప్ప, నరేంద్ర, పురసభ సభ్యులు నంజుండప్ప, శ్రీనివాస్, అప్పయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

చేళూరులో...

చేళూరు: గురుపూర్ణిమను పురస్కరించుకుని చేళూరు పట్టణంలో సాయిబాబా మందిరంలో ఆదివారం విశేష కార్యక్రమాలు సాగాయి. స్వామివారి చిత్రపటానికి విశేషపూజలు, అలంకరణలు చేశారు. భక్తి కీర్తనలు, భజనలు నిర్వహించారు. పురవీధులలో ఊరేగింపు జరిగింది. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



శాంతిధామలో విశేష అలంకరణలో షిర్డీసాయిబాబా

విజయపురలో...

విజయపుర: మానవుడి సహజ ఆహారం శాకాహారమని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మూవ్‌మెంట్స్ (పీఎస్ఎస్ఎం) ప్రేమనాథ్ అభిప్రాయపడ్డారు. అఖిల కర్ణాటక పిరమిడ్ ధ్యానకేంద్రం ఆధ్వర్యంలో గురుపూర్ణిమ సందర్భంగా ఆదివారం శాకాహార జనజాగృతి జాథా నిర్వహించారు. పట్టణంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంచాలకులు బీకే రూపక్క నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. పురసభ మాజీ అధ్యక్షుడు విమలా బసవరాజు మాట్లాడుతూ శాకాహారంతో సాత్విక గుణాలు పెంపొందుతాయన్నారు.

శాంతిధామలో గురుపూర్ణిమ వేడుకలు

బొమ్మనహళ్ళి, జూలై 21: గురుపూర్ణిమను పురస్కరించుకుని అరికెరె శాంతి నికేతన్ లే అవుట్‌లో వెలసిన శాంతిధామలో ఆదివారం విశేష కార్యక్రమాలు సాగాయి. 15వ వార్షిక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. షిర్డీసాయిబాబాకు సుప్ర భాత సేవ, క్షీరాభిషేకం, అనంతరం జలాభిషేకం, అలంకరణ, మహా మంగళారతి నిర్వహించారు. రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా దర్శనానికి అవకాశం కల్పించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అంకరించారు. శాంతిధామలో షిర్డీసాయిబాబా, మంజునాథస్వామి, సాయి సంతోషిమాతా ఆలయాలు ఉండగా ఆదివారం కావడంతో సుమారు 40వేలమంది భక్తులు దర్శించినట్టు ఆలయా కమిటీ అధ్యక్షుడు మేడా రామకృష్ణ వెల్లడించారు. మానవాళికి జ్ఞానాన్ని విద్యను అందించిన వ్యాసమహర్షి పుట్టినరోజును గురుపూర్ణిమగా ఆచరిస్తున్నారన్నారు. సత్యనారాయణస్వామి వ్రతంలోనూ పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల సందర్శనలో ఆలయ ట్రస్టు సభ్యులు, వలంటీర్‌లు నిరంతరం పాల్గొన్నారన్నారు. బాబకు ఇష్టమైన రొట్టెలు, లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేసినట్టు తెలిపారు. ట్రస్టు సభ్యులు తాతయ్యగుప్త, మనోహర్‌గుప్త, వెంకటేశ్ గుప్త, కృష్ణయ్య శెట్టి, పెద్దసంఖ్యలో సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.



బాగేపల్లిలో షిర్డీసాయిబాబాకు అలంకరణ



విజయపురలో ఊరేగింపు

రాజీనామా కోరే నైతిక హక్కు బీజేపీకి లేదు

» ఎమ్మెల్యే శివరాం హెబ్బార్



మీడియాతో ఎమ్మెల్యే శివరాం హెబ్బార్

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నేను ఏ పార్టీలోనూ గుర్తింపుగా లేనని కర్ణాటక శాసనసభ పార్టీ అని, నా రాజీనామా కోరే నైతిక హక్కు బీజేపీకి లేదని ఉత్తరకన్నడ జిల్లా ఎల్లాపుర బీజేపీ ఎమ్మెల్యే శివరాం హెబ్బార్ సవాల్ విసిరారు. ఉత్తరకన్నడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నేను గతంలోనే రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేసి గెలిచానన్నారు. ప్రజల విశ్వాసంతో గెలిచానన్నారు. నాకు రాజీనామా గురించి ఎవరూ చెప్పాల్సిన పని లేదన్నారు. మేం కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరినప్పుడు మీకు అనిపించిందా..? అని ప్రశ్నించారు. శాసనసభలో నాతో బీజేపీ ఎమ్మెల్యేలు కలసి ఉండడం ఇష్టం లేదనేది వారి వ్యక్తిగతమన్నారు. ప్రజా జీవితంలో అన్ని అనుభవించాల్సి ఉంటుందని, అన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సవాల్ విసిరారు.

బయోకాన్ కంపెనీకి నల్లరంగు

» ఉద్యోగ రిజర్వేషన్ వ్యతిరేకించినందుకు నిరసన



సంస్థ పేర్లకు నల్లరంగు వేస్తున్న ఆందోళనకారులు

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమల్లో కన్నడిగులకు ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించాలనే ప్రభుత్వ ఆలోచనను తీవ్రంగా ఖండించిన బయోకాన్ సీఎండీ కిరణమజుందార్‌షాపై కన్నడ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎలక్ట్రానిక్‌సిటీ సమీపంలోని బయోకాన్ కంపెనీ బోర్డులకు నల్లరంగు పూసి నిరసన వ్యక్తం చేశారు. కన్నడిగులకు ప్రైవేట్ సంస్థలలో సీ, డీ గ్రూప్‌లలో 75శాతం, మేనేజిమెంట్ ఉద్యోగాలలో 50శాతం రిజర్వేషన్ కల్పించేలా వారం క్రిందట కర్ణాటక కేబినెట్ తీర్మానించింది. ఇందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త బయోకాన్ సీఎండీ కిరణ్ మజుందర్‌షా, మోహన్‌దాస్‌పై, ఫోన్‌పే సంస్థ కో ఫౌండర్ సమీర్ తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే కన్నడ సంఘాలు ఫోన్‌పే యాప్‌ను రద్దు చేసుకునేలా పిలుపునిచ్చారు. మరోవైపు ఫోన్‌పే రాయ బారిగా వ్యవహరిస్తున్న నటుడు కిచ్చ సుదీప్ తన అగ్రిమెంట్‌ను రద్దు చేసుకునేందుకు సిద్ధమైనట్టు తెలు స్తోంది. తాజాగా కిరణ్‌మజుందార్‌షాకు చెందిన బయో కాన్ సంస్థ బోర్డులకు నల్లరంగు పూసి నిరసన తెలిపారు. ఆందోళనకారుల నిరసన పరిస్థితి ఎక్కడికి దారి తీయనుందో వేచి చూడాలి.

మైసూరు ఉత్సవాలకు 18 గజరాజుల జాబితా

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మైసూరులో జరిగే చారిత్రాత్మక దసరా ఉత్సవాల్లో పాల్గొనే 18 గజరాజుల జాబితాను అటవీశాఖ అధికారులు సిద్ధం చేశారు. దసరా ఉత్సవాలకు దాదాపు మూడు నెలల ముందునుంచే ప్రక్రియ చేపడతారు. అక్టోబరు 12న విజయదశమి జరగనుంది. జంబూసవారీలో పాల్గొనే ఏనుగులకు రెండు నెలల ముందునుంచే శిక్షణలు ఇస్తారు. అందుకే కసరత్తు ప్రారంభించారు. నాగరహొళె, మత్తిగోడు, భీమనకట్టి, దొడ్డ హరవ తోపాటు కొడగులోని దుబారె, బండిపురలోని రాంపుర అభయారణ్యాలనుంచి ఏనుగుల ఎంపిక చేపట్టినట్టు మైసూరు అటవీ విభాగం డీసీఎఫ్ శరణబసప్ప తెలిపారు. పశువైద్యాధికారులతో కలసి 22 ఏనుగులను ప్రాథమికంగా గుర్తించామని వీటిలో 18 ఏనుగుల జాబితా సిద్ధం చేశామన్నారు. 14 ఏనుగులు జంబూ సవారి ఊరేగింపులో పాల్గొంటాయన్నారు. నాలుగు ఏనుగులు రిజర్వుగా ఉంటాయన్నారు. ఏనుగులను అభయారణ్యం నుంచి తీసుకొచ్చే ప్రక్రియ ఆగస్టులో అమలు చేస్తామన్నారు. తొలి విడతలో 9 ఏనుగులు ప్యాలెస్‌కు రప్పించదలిచారు. జంబూ సవారి కేప్టెన్‌గా అభిమన్యు, భీమ, కొత్త ఏనుగు ఏకలవ్య, భీమనకట్టె క్యాంప్ నుంచి ధనంజయ, గోపి, కంజన్, రామాపుర క్యాంప్ నుంచి రోహిత, లక్ష్మి ఏనుగులు రానున్నాయి. రెండో బృందంలో దుబారె క్యాంప్ నుంచి ప్రశాంత్, సుగ్రీవ, మత్తిగోడు క్యాంప్‌నుంచి మహేం ద్ర, రాంపుర నుంచి హిరణ్య ఏనుగులను తీసుకు రాదలిచారు. అదనంగా అయ్యప్ప, పార్థసారథి, మాలాదేవి ఏనుగులను తీసుకొచ్చే ఆలోచన ఉన్నట్టు తెలిపారు.

ఉత్తమ స్నేహసంబంధాలు కలిగి ఉండాలి

శిడ్లఘట్ట, జూలై 21: విద్యార్థి దశనుంచే ఉత్తమ స్నేహసంబంధాలు కలిగి ఉండాలని విద్యాపరంగా ప్రగతి సాధించేందుకు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రభుత్వ పీయూ కళాశాల ప్రిన్సిపాల్ మునిరాజు అభిప్రాయపడ్డారు. తాలూకాలోని సాదలి గ్రామంలో ప్రభుత్వ పీయూ కళాశాలలో ప్రథమ పీయూసీ విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి యువత పుస్తకాలకే పరిమితం కాకుండా సమాజంలోని పలు అంశాలపై అవగాహన పెంపొందించు కోవాలన్నారు. కొన్నిరకాల ఆకర్షణలు తాత్కాలికమని వాటి వెనుక పరుగెత్తరాదన్నారు. రిటైర్డు టీచర్ నాగరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డు సురక్షతా నియమాలు పాటించాలని, స్వచ్ఛందంగా సమాజసేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావాలన్నారు. విద్య అనంతరం ఉత్తమ జీవనానికి బాటలు వేసుకోవాలన్నారు. రైట్‌లివ్ సంస్థ కళాశాలకు 10 కంప్యూటర్‌లను సమకూర్చింది. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. కళాశాల అభివృద్ధి సమితి ఉపాధ్యక్షుడు అశ్వత్థప్ప, సభ్యులు కదిరప్ప, నంజప్ప, రైట్‌లివ్ సంస్థ సునిల్, బాగేపల్లి బాలికల కళాశాల అమీర్‌జాన్, లెక్చరర్ రాజప్ప, సుష్మా, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు సన్మానం

కళ్ల సమస్యలపట్ల చైతన్యం ముఖ్యం

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కళ్ల సమస్యల పట్ల చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని బెంగళూరు ఆప్తాల్మిక్ సొసైటీ (బాస్) సమ్మిట్ 2024లో నిపుణులు అభిప్రాయపడ్డారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఇళంకుమరన్ పశుపతి అధ్యక్షతన ఆదివారం సెయింట్‌జాన్స్ ఆడిటోరియంలో సదస్సు జరిగింది. ఏడీజీపీ హరిశేఖరన్ ముఖ్యులుగా పాల్గొన్నారు. హరిశేఖరన్ మాట్లాడుతూ కంటి వైద్యుల సేవలు అపారమన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జబ్బులు పెరుగుతున్నాయని వాటికి చికిత్సలతోపాటు పరిశోధనలు జరిపి తగిన వైద్య విధానం తీసుకురావాలని సూచించారు. పశుపతి మాట్లాడుతూ అందరూ వృద్ధులు అవుతున్నారన్నారు. తల్లిదండ్రులు, అవ్వతాతలే కాకుండా నేటి సమాజంలో యువత కూడా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఢిల్లీ సెంటర్ ఆఫ్ సైట్‌లో సేవలందిస్తున్న లలిత్‌వర్మ మాట్లాడుతూ సదస్సుకు 260మంది జాతీయస్థాయి నిపుణులు రావడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో ఐ బ్యాంకింగ్ సేవలు పెరగాలని పలువురు సిఫారసు చేశారు. పిడియాట్రిక్ ఆప్తాలజీలో ఏం చేయాలి, ఎటువంటి వైద్యసేవలు చేయరాదనేది ప్రాధాన్యత అన్నారు. డ్రై ఐ మేనేజిమెంట్‌లో ఆధునిక విధానాలు పాటించాలన్నారు. హార్డ్ క్యాటరాక్ట్ పర్యవేక్షణ, చిన్నపిల్లలకు కళ్లజోళ్లు సూచించడం ఆచితూచి వ్యవహరించాలన్నారు. థైరాయిడ్‌తో కంటి జబ్బులు పెరుగుతున్నాయని వాటి పట్ల సమగ్ర చికిత్సలు అవసరమని అభిప్రాయపడ్డారు. డయాబెటిక్ రెటినోపతికి లేజర్ చికిత్స పాటించాలని, వయస్సు ఆధారిత మాక్యులర్ డీ జనరేషన్, పట్ల అవగాహన కల్పించాకనే చికిత్సలు జరపాలన్నారు. కంటి వైద్యులు ఆధునిక విధానాలు అవలంబించుకోవాలని సూచించారు. సదస్సులో వందలాదిమంది బాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.



బెంగళూరు ఆప్తాల్మిక్ సొసైటీ సదస్సులో పాల్గొన్న ప్రముఖులు

భువనేశ్వరి రథయాత్రను విజయవంతం చేయండి

పావగడ, జూలై 21 : కన్నడమాత భువనేశ్వరి మాత రథయాత్రను విజయవంతం చేయాలని తహసీల్దార్ వరదరాజులు తెలిపారు. శిర నుంచి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకున్న అమ్మవారి రథాన్ని కన్నడ అభిమానులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొని పావగడ పట్టణంలోకి స్వాగతించాలని ఆయన కోరారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి దేవరాజుఅరస్ హయాంలో మైసూరు రాష్ట్రంగా ఉన్న కర్ణాటకను బెంగళూరు రాజధానిగా ఏర్పాటు చేసి 50ఏళ్ల కావస్తున్న నేపథ్యంలో కన్నడ రథయాత్ర రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనుందని తెలిపా రు. సోమవారం జరిగే ఈ రథయాత్రలో కన్నడ అభిమానులు, కన్నడ సాహిత్యపరిషత్ కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సదా మీ సేవలో



అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

ఇట్లు: జనరల్ మేనేజర్

అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ 95909 81234
ACO బెంగళూరు సౌత్ 77951 55585
SR బెంగళూరు ఈస్ట్ 88616 94202
SR బెంగళూరు నార్త్ వెస్ట్ 99009 22004
SR హొసూరు 86818 81386
ACO - బళ్ళారి 95027 41328